క్లుప్తంగా

బోరుబావులకు మరమ్మతులు


మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు శ్రీహరిపురం పరిధిలోని పలు ప్రాంతాల్లో నిరుపయోగంగా ఉన్న బోరుబావులను శుక్రవారం వినియోగంలోకి తీసుకువచ్చారు. పాతరామాలయం వీధి,రామ్‌నగర్ ప్రాంతాల్లో బోరుబావులు కొంత కాలం నుంచి పని చేయడం లేదు. స్థానిక నాయకుడు పోతబత్తుల శ్రీను జీవీఎంసీ వాటర్ సప్లై అధికారులకు సమస్య వివరించారు. దీంతో సిబ్బంది పనులు చేపట్టి వినియోగంలోకి తీసుకువచ్చారు.

గోపాలపట్నం తహసీల్దార్‌కు ఘనంగా వీడ్కోలు


తహసీల్దార్ విజయ భాస్కర్‌ను సన్మానిస్తున్న కార్యాలయ అధికారులు, సిబ్బంది

విశాఖ విద్య: గోపాలపట్నం తహసీల్దార్‌గా విధులు నిర్వహించి విజయనగరం బదిలీ అయిన పి. విజయ భాస్కర్‌కు శుక్రవారం కార్యాలయ అధికారులు, సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. ఎన్నికలకు ముందు జిల్లాకు బదిలీపై విజయభాస్కర్ వచ్చారు. ఉన్నతాధికారుల సూచనలకు అనుగుణంగా పనిచేసి అందరి మన్ననలు పొందారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సువర్ణాబాయి, సర్వేయర్ జగదీష్, ఆర్ఐ సురేష్ కుమార్, వీఆర్‌వోలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కల పెంపకం అవశ్యం


విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేసిన మజ్జి మాలినాయుడు

సింథియా: పర్యావరణ పరిరక్షణతో పాటు కాలుష్యాన్ని నియంత్రించడంలో మొక్కలు ప్రధాన పాత్ర పోషిస్తాయని 62వ వార్డు టీడీపీ అధ్యక్షులు మజ్జి మాలినాయుడు అన్నారు. త్రినాథపురం ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు రమణికుమారి ఆధ్వర్యంలో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. అనంతరం విద్యార్థులకు పూల మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాలిమేర శ్రీనివాసరావు, డొప్ప సన్యాసిరావు, దుర్గారావు, సత్యనారాయణ, శ్రీధర్, సూరిబాబు, అప్పలరెడ్డి పాల్గొన్నారు.

జూలో చిత్ర లేఖన పోటీలు రేపు

ఆరిలోవ: ఇందిరా గాంధీ జూ పార్కులో ఆదివారం విద్యార్థులకు పులులపై చిత్ర లేఖనం పోటీలు నిర్వహించనున్నట్లు జూ క్యూరేటర్ నందనీ సలారియా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29న ప్రపంచ పులుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ పోటీలు ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. ఒకటో తరగతి నుంచి పీజీ వరకు చదువుతున్న విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ పోటీలు జూలో జరుగుతాయన్నారు. ఒకటి నుంచి 5వ తరగతి వరకు పులులు, వాటి పిల్లలు, 6 నుంచి 10వ తరగతి వరకు పులులపై మానవ ప్రభావం, ఇంటర్మీడియెట్ నుంచి పీజీ వరకు పులులపై వాతావరణ మార్పులు అనే అంశాలపై చిత్రాలు వేయాల్సి ఉంటుందన్నారు. ఫొటోగ్రఫీ పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలకు బహుమతులు, పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు తెలిపారు.

నిర్లక్ష్యపు చీకట్లు

- వీధిలైట్ల నిర్వహణలో జీవీఎంసీ అధికారుల అలసత్వం
- ప్రధాన రహదారిపై అలముకున్న అంధకారం


సింథియా నుండి మల్కాపురం ప్రధాన రహదారిలో వెలగని వీధి లైట్లు


హెచ్‌పీసీఎల్ లేబర్ గేటు వద్ద చీకటిలో ప్రయాణిస్తున్న భారీ వాహనాలు


మల్కాపురం ప్రకాష్‌నగర్‌లో వెలగని వీధిలైట్లు

సింథియా: విద్యుత్ దీపాల నిర్వహణలో జీవీఎంసీ అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మల్కాపురం నుంచి సింథియా వరకు ఉన్న ప్రధాన రహదారిపై వీధిదీపాలు వెలగకపోవడంతో రాత్రివేళల్లో అంధకారం నెలకొంటోంది. గతంలో షిప్‌యార్డ్ నుంచి హెచ్‌పీసీఎల్‌కు భారీ యంత్రాలను తరలించే క్రమంలో మల్కాపురం నుంచి సింథియా వరకు ఉన్న వీధి దీపాలను, రోడ్డు మధ్య ఉన్న డివైడర్‌తో సహా తొలగించారు. దీంతో చీకటి పడిన తర్వాత ఆ మార్గంలో ప్రయాణమంటేనే ప్రజలు భయపడే పరిస్థితి నెలకొంది. మరోవైపు చీకట్లో ఆకతాయిల ఆగడాలు మితిమీరిపోతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మద్యం సీసాలతో విద్యుత్ దీపాలను పగులగొడుతున్నారని తెలిపారు. దీనిపై జీవీఎంసీ, విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని స్థానికులు ఆరోపిస్తున్నాయి. ఇప్పటికైనా స్పందించి, వీధిలైట్ల సమస్యను పరిష్కరించి, ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

రైల్వేస్టేషన్‌లో 31.2 కిలోల గంజాయి పట్టివేత


రైల్వే పోలీసుల అదుపులో గంజాయి, ఐదుగురు రవాణాదారులు

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో గంజాయి రవాణా చేస్తున్న యువకులను రైల్వే పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా.. జీఆర్పీ, ఆర్పీఎఫ్ ఉన్నతాధికారుల ఆదేశాలతో శుక్రవారం జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది విశాఖ రైల్వే స్టేషన్‌లోని వివిధ ప్లాట్ ఫారాల్లో తనిఖీలు నిర్వహించారు. బెంగుళూరుకు చెందిన ఆకాష్, పాడువకు చెందిన ఖేముందు, హర్యానాకు చెరందిన అవినాష్, బీహార్‌కు చెందిన అమృత్‌కుమార్, కేరళకు చెందిన టామ్ అలెక్స్‌లు అక్రమంగా గంజాయిని రవాణా చేయడం గుర్తించారు. వీరు ఈ గంజాయిని విశాఖ రైల్వేస్టేషన్ మీదుగా కేరళ, కర్ణాటక, హర్యానా, బిహార్ రాష్ట్రాలకు తరలిస్తున్నట్లు తెలిపారు. ఐదుగురిని అదుపులోకి తీసుకుని వీరి వద్ద నుంచి సుమారు రూ.1,04,500 విలువైన 31.2 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

15.61 కిలోల గంజాయి స్వాధీనం

సీతమ్మధార: గుట్టుచప్పుడు కాకుండా గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను శుక్రవారం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు అరెస్ట్ చేశారు. రామాటాకీస్ రోడ్డులోని ప్రభుత్వ కంటి ఆస్పత్రి ప్రాంతంలో ముగ్గురు వ్యక్తులు గంజాయి తరలిస్తున్నట్లు సమాచారంతో పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అడిషనల్ ఎస్పీ బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోదాలు నిర్వహించారు. సుమారు 15.61 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కేరళ రాష్ట్రం త్రిశూల్‌కు చెందిన సఫాల్ సలీం, సునీల్‌కుమార్, అబిన్ సుబ్రాన్‌లు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ యు.సుబ్బారావు, ఇన్‌స్పెక్టర్ టి.వెంకటప్పలనాయుడు, ఎస్ఐ, ఎస్.ముసలనాయుడు, డీటీఎఫ్ ఎస్ఐ వేణుగోపాల్, హెచ్‌సి.శ్రీనివాస్, (టాస్క్‌ఫోర్స్) కానిస్టేబుళ్లు అప్పలనాయుడు, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బోరుబావి బాగు చేయరూ!



పద్మనాభనగర్‌లో మరమ్మతులకు గురైన బోరుబావి

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు పద్మనాభనగర్‌లో మరమ్మతులకు గురైన బోరుబావిని బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు. పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు పర్యటించినప్పుడు ఇక్కడి పరిస్థితిని వివరిస్తే బోరుబావిలో వాటర్ రావడం లేదని.. లోతు పెంచాలని కుంటి సాకులు చెప్పి వెళ్లిపోయారని వాపోతున్నారు. చాలా కుటుంబాలు ఈ బోరుబావి నీటిపైనే ఆధారపడి ఉన్నారని చెబుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి బోరుబావిని బాగు చేయాలని కోరుతున్నారు.

కార్గిల్ అమరవీరులకు ఘన నివాళి


ర్యాలీ నిర్వహిస్తున్న అసోసియేషన్ సభ్యులు


కొవ్వొత్తుల ప్రదర్శన చేస్తున్న సభ్యులు

విశాఖ విద్య: కార్గిల్ విజయ్ దివస్ పురస్కరించుకొని జీవీఎంసీ 90వ వార్డు కాకానినగర్, వినోద్ నగర్, విమాన్ నగర్, కనకమహాలక్ష్మి నగర్, కాకాని నగర్ వెటరన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్మీ రిటైర్డ్ ఉద్యోగులు శుక్రవారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. అమర వీరుల చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా వీవీకేకే వెటరన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్మోహన్‌రావు మాట్లాడుతూ పాకిస్తాన్ దురహంకారానికి బుద్ధి చెప్పి 25 సంవత్సరాలు అయిందన్నారు. కార్గిల్ అమర వీరుల త్యాగం, సాహసాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి యుగంటేశ్వరరావు, కోశాధికారి మురళీధర్, అసోసియేషన్ నాయకులు రాము, శేఖర్, శ్యామ్, విమాన్ నగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గొట్టిపాటి సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ఎంఈఎస్ బిల్డర్స్ అసోసియేషన్ నిరసన


చీఫ్ ఇంజనీర్(నేవీ)కు వినతిపత్రం అందిస్తున్న ఎంఈఎస్ బిల్డర్స్ అసోసియేషన్ విశాఖపట్నం బ్రాంచి ప్రతినిధులు

తాటిచెట్లపాలెం: ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను తక్షణం పరిష్కరించాలని మిలటరీ ఇంజినీరింగ్ సర్వీసెస్ బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా విశాఖపట్నం బ్రాంచి చైర్మన్ జి.వి. రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు అసోసియేషన్ ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ రోడ్‌లోని చీఫ్ ఇంజినీర్(నేవీ) ఎంఈఎస్ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన దినం పాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న రీ ఎన్‌లిస్ట్‌మెంట్ కేసులను ఆమోదించాలన్నారు. గ్యారిజన్ ఇంజినీర్‌తో పని పూర్తి సర్టిఫికెట్, వర్కింగ్ గ్రూప్ సిఫార్సులను అందజేసిన వెంటనే పెర్ఫార్మెన్స్‌లో సెక్యూరిటీలో 50 శాతం విడుదల చేయాలని కోరారు. పునర్విభజన ప్రక్రియ పూర్తయ్యే వరకు రూ.25 లక్షల నుంచి రూ. 50 లక్షల్లోపు కాంట్రాక్టులను ఈ క్లాస్ కాంట్రాక్టర్లకు అప్పగించాలని డిమాండ్ చేశారు. ఎల్–1 సిస్టం వల్ల పెద్ద కాంట్రాక్టర్లు నష్టపోతున్నారని, పనుల్లో నాణ్యత లోపిస్తుందని, దీనిపై కేంద్ర ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. అనంతరం చీఫ్ ఇంజినీర్(నేవీ)(ఎంఈఎస్) అఖిలేంద్రసింగ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ సెక్రటరీ బి.వి.ఎస్.సుబ్బరాజు, వైస్ ప్రెసిడెంట్ పంకజ్ ప్రహ్లాదక, సీనియర్ వైస్ చైర్మన్ డి.సూరిబాబు, వైస్ చైర్మన్లు ఎస్.రాజశేఖర్, ఎంవీ రమణ, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులతో స్నేహభావంతో మెలగాలి

- సీపీ శంఖబ్రత బాగ్చి


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చి

పెదగంట్యాడ: ఫిర్యాదుదారుల పట్ల స్నేహభావంతో మెలగాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సిబ్బందికి సూచించారు. న్యూపోర్టు పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. స్టేషన్ అధికారులు, సిబ్బంది ఫిర్యాదుదారులతో ప్రవర్తిస్తున్న తీరును పరిశీలించారు. స్టేషన్‌ను ఆనుకుని ఉన్న ఖాళీ ప్రాంతాలను వ్యర్థాలతో నింపకుండా శుభ్రం చేయించి, మొక్కలు నాటాలని ఆదేశించారు. స్టేషన్ లోపల అన్ని ప్రాంతాలు పరిశీలించారు. స్టేషన్‌తో పాటు మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచాలని సూచించారు. స్టేషన్లో సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. పెండింగ్ కేసులు తక్షణమే పరిష్కరించాలని తెలిపారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారులతో మాట్లాడారు. రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుదారుల సమస్యలను పారదర్శకంగా విచారణ చేసి త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. సిబ్బంది విధ్యార్హతలు తెలుసుకుని, వారి పనితీరుపై ఆరా తీశారు. స్టేషన్ ఆవరణలో ఉన్న సీజ్ చేసిన వాహనాలు పాడవకుండా చర్యలు చేపట్టాలన్నారు. క్రైం ప్రివెన్షన్, డిటెక్షన్, ప్రాసిక్యూషన్‌కు ఎంతో ఉపయోగపడే సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్ల కదలికలపై నిఘా ఉంచాలన్నారు.

సకాలంలో అభివృద్ధి పనులు పూర్తి

- డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్


అధికారులతో కలిసి పనులు పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

విశాఖ విద్య: అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. 52వ వార్డు పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను శుక్రవారం జీవీఎంసీ అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల అవసరాల మేరకు చేపడుతున్న పనుల పూర్తిపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్న పార్కు సుందరీకరణకు అవసరమైన పనులు పూర్తి చేయాలన్నారు. ఇంకా మిగిలిన ఉన్న పనులు గుర్తించి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పర్యటనలో డీఈ ఏడుకొండలు, ఏఈ ఉష, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

'మళ్ల'ను కలిసిన నాయకులు


మళ్ల విజయప్రసాద్‌ను కలిసిన పశ్చిమ నియోజకవర్గ నాయకులు, కార్పొరేటర్లు

గోపాలపట్నం: మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్‌ను శుక్రవారం పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్పొరేటర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. తాజా రాజకీయ పరిణామాల గురించి చర్చించారు. కార్పొరేటర్లు పీవీ సురేష్, గుండపు నాగేశ్వరరావు, ముర్రువాణి, నాయకులు గులిగిందల కృష్ణ,దొడ్డి కిరణ్, దాడి సత్యనారాయణ, చుక్క ప్రసాదరెడ్డి, యల్లపు వెంకటేశ్వరరావు, పైడి రతక్నాకర్, బాకి శ్యామ్ కుమార్ రెడ్డి, డానియల్ తదితరులు పాల్గొన్నారు.

అను'భౌ'వించు రాజా


గుల్లలపాలెం వద్ద పార్కు చేసిన కారుపై దర్జాగా కూర్చున వీధి కుక్క


మల్కాపురం వద్ద కారుపై సేదతీరుతున్న శునకం

మల్కాపురం: జీవీఎంసీ 58,61 వార్డుల్లోని పలు ప్రాంతాల్లో వీధికుక్కల బెడద అధికంగా ఉంది. పగలు,రాత్రి అన్న తేడా లేకుండా వీధుల్లో సంచరిస్తూ ఆ మార్గాన వచ్చే వారిపై దాడికి దిగుతున్నాయి. దీంతో సర్వీసు రోడ్లపై పార్కు చేసిన ఆటో,కార్లపైకి ఎక్కి దర్జాగా కూర్చుంటున్నాయి. మల్కాపురం ప్రాంతంలో గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగస్వాములు కావాలి


స్వచ్ఛ సర్వేక్షణ్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

సింథియా: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ప్రజలంతా భాగస్వాములై ఈ ఏడాది విశాఖ నగరానికి మొదటి ర్యాంక్ వచ్చేలా సహకరించాలని 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు అన్నారు. వార్డు పరిధి ఏకేసీకాలనీలో శుక్రవారం స్వచ్ఛ సర్వేక్షణ్, సీజనల్ వ్యాధుల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ డ్రైడే–ఫ్రైడేపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు ప్రతి శుక్రవారం, మంగళవారం ఇంట్లో అత్యవసరానికి కావాల్సిన నీరు ఉంచుకుని, మిగిలిన నీటి పాత్రలను ఖాళీ చేయడం ద్వారా సీజనల్ వ్యాధుల కారక దోమల నుంచి రక్షణ పొందవచ్చునన్నారు. ప్రజలు వ్యర్థాలను తడి–పొడి చెత్తగా ఇంటి వద్దే వేరు చేసి పారిశుధ్య కార్మికులకు అందజేయాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతోనే వ్యాధులను నియంత్రించవచ్చునని చెప్పారు. డెంగ్యూ కారక దోమలు మంచినీటిలోనే ఉత్పన్నమవుతాయని, 3 రోజులకు ఒకసారి మంచినీటి నిల్వలను మార్చుకోవాలని సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నియంత్రించి, పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో బయాలజిస్ట్ సాంబమూర్తి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్, మలేరియా ఇన్‌స్పెక్టర్ రవి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా వంటి వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ నవరత్నం అన్నారు. జీవీఎంసీ 62వ వార్డు త్రినాథపురంలో ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. వ్యక్తిగత పరిశుభ్రతతోనే వ్యాధులను నియంత్రించవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రమణికుమారి, సూపర్‌వైజర్ దుల్లా శ్రీనివాసరావు, శానిటరీ సెక్రటరీలు ప్రదీప్, వెంకునాయుడు, శ్రీనివాసరావు, మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.


గోపాలపట్నంలో ర్యాలీ చేస్తున్న శానిటరీ అధికారులు, సిబ్బంది

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన

గోపాలపట్నం: జీవీఎంసీ ప్రజారోగ్య శాఖ ఆధ్వర్యంలో 92వ వార్డులో శుక్రవారం స్వచ్ఛ సర్వేక్షణ్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. గోపాలపట్నం బంక్ నుంచి వార్డు పరిధిలో పలు వీధుల్లో ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా దుకాణదారులకు, ప్రజలకు స్వచ్ఛతపై శానిటరీ ఇన్‌స్పెక్టర్ గోపీ అవగాహన కల్పించారు. పారిశుధ్య నిర్వహణను అందరూ బాధ్యతగా భావించాలని కోరారు. రోడ్లపై, కాల్వల్లో చెత్త వేయరాదని.. డస్ట్‌బిన్లలో వేసి పారిశుధ్య కార్మికులకు అందించాలని సూచించారు. దుకాణదారులు రెండు డస్ట్‌బిన్లు ఏర్పాటు చేసుకుని, తడి, పొడి చెత్తను వేర్వేరుగా వాటిల్లో వేయాలని తెలిపారు. జీవీఎంసీ పరిధిలో ప్లాస్టిక్ సంచులు నిషేధించామని, వాటిని వాడవద్దని, వాటికి బదులు వస్త్ర సంచులు వాడడం వల్ల పర్యావరణానికి ఎంతో ప్రయోజనం ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఏఎఫ్ లాజరస్, అవుట్‌సోర్సింగ్ సూపర్‌వైజర్లు దమ్ము శ్రీనివాసరావు, సత్యనారాయణ, వెంకటరమణ, సచివాలయం కార్యదర్శులు మణికుమార్, శోభారాణి, చైతన్య కుమారి, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో 'ఉక్కు'ను కాపాడుకుందాం

అగనంపూడి: విశాఖ ఉక్కు పరిరక్షణకు అందరినీ కలుపుకొని ముందుకు వెళ్లడం మంచిదని మానవ హక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యామ్ ప్రసాద్ అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు నిరసనగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో నిర్వహిస్తున్న రిలే దీక్షల్లో 1261వ రోజు, శుక్రవారం ఉక్కు ఇంటక్ ప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయడం ఒక్కటే శరణ్యమని, అలాగే తక్షణ సాయంగా విశాఖ ఉక్కుకు రూ.పదివేల కోట్లు అందివ్వాలని డిమాండ్ చేశారు. మూడున్నర ఏళ్ల నుంచి ఉద్యమం కొనసాగుతున్నా లెక్క చేయకపోవడం రాష్ట్ర ప్రజలను అవమానించడమే అవుతుందన్నారు. తెలుగు ప్రజల సెంటిమెంట్‌తో ముడిపడి ఉన్న స్టీల్‌ప్లాంట్‌తో వ్యాపారం చేయాలనుకోవడం దుర్మార్గమన్నారు. ఉక్కు ఇంటక్ కార్యదర్శి మంత్రి రాజశేఖర్, ఏఐటీయూసీ కార్యదర్శి డి.ఆదినారాయణ మాట్లాడుతూ విశాఖ ఉక్కును ప్రైవేటీకరించాలనే ఆలోచన రావడం దుర్మార్గమని, దానికి అనుగుణంగా అడుగులు వేయడం దేశ ద్రోహం అవుతుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు నీరుకొండ రామచంద్రరావు, బీఎస్ రాజు, జి.వి.సుబ్బయ్య, కారు రమణ, కొవిరి అవతారం, పి.వి.రమణమూర్తి, పోతారెడ్డి, హరనాథ్, గంగవరం గోపీ, త్రిమూర్తులు, వేణువర్మ, ఎస్.ఎ.నాయుడు,గోవిందరావు పాల్గొన్నారు.

రాజ్యాంగ హక్కులను పరిరక్షించాలి



మహాసభలో మాట్లాడుతున్న కార్పొరేటర్ గంగారావు

ఉక్కునగరం: రాజ్యాంగ హక్కులను పరిరక్షించాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు సుబ్బన్న పిలుపునిచ్చారు. ఉక్కునగరంలో శుక్రవారం నిర్వహించిన కేవీపీఎస్ 7వ మహాసభలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగాన్ని దేశ ప్రజలందరూ అంబేడ్కర్ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. దేశ అధికారం కొంత మంది చేతుల్లో ఉందని, బడుగు, బలహీన వర్గాల చేతిలో ఉన్నప్పుడే నిజమైన రాజ్యాంగ స్ఫూర్తి అన్నారు. ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యు. శ్రీనివాసరావు మాట్లాడుతూ బహుజనులందరూ ఏకమైతే నిజమైన రాజ్యాంగ ఫలం దక్కుతుందన్నారు. కార్పొరేటర్ బి.గంగారావు మాట్లాడుతూ రాజ్యాంగాన్ని కాపాడుకోవడంతో పాటు హక్కులు కాపాడుకోవడానికి అందరూ పోరాడాలన్నారు. కార్యక్రమంలో ఎం.కృష్ణారావు, వి.ప్రకాశ వరకుమార్, టి.చిరంజీవి, వై.టి.దాస్, కె.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.